సాక్షి మంచిర్యాల

శుక్రవారం। 5। ఏప్రిల్। 2024



మామిడి మార్కెట్‌కు మోక్షమెప్పుడో?

జిల్లాలో మామిడి మార్కెట్ సౌకర్యం లేక మహారాష్ట్రకు తరలించి విక్రయించాల్సి వస్తోంది. రైతులకు భాష రాక దళారుల చేతిలో మోస పోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. 8లో▸

రంజాన్ వేళలు

శుక్ర ఇఫ్తార్ 6:32

శని సహర్ 4:43

వాతావరణం

గరిష్టం/కనిష్టం 41.0 /28.0

ఆకాశం ఉదయం వేళ ప్రకాశవంతంగా, రాత్రి వేళ మేఘావృతమై ఉంటుంది. వేడిగాలులు వీస్తాయి. ఉక్కపోతగా ఉంటుంది. గరిష్ట ఉష్ణోగ్రత మరింత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

ఓటు హక్కు వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ బి.రాహుల్

నస్పూర్: రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటుహక్కు వినియోగించుకోవాలని అదనపు కలెక్టర్ బి.రాహుల్ తెలిపారు. గురువారం ఆయన స్థానిక కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతీలాల్‌తో కలిసి స్వీప్ కోర్ కమిటీ ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 15వరకు నూతన ఓటరు నమోదు చేపడుతామని తెలిపారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్, డీపీఓ వెంకటేశ్వర్లు, డీఐఈఓ శైలజ, డీఈవో ఎస్.యాదయ్య, డీఎంహెచ్‌వో సుబ్బరాయుడు, జిల్లా సంక్షేమ అధికారి చిన్నయ్య పాల్గొన్నారు.

డుమ్మా కొట్టిన ముగ్గురు టీచర్ల సస్పెన్షన్

మంచిర్యాలఅర్బన్: పదో తరగతి మూల్యాంకన విధులకు డుమ్మా కొట్టిన ముగ్గురు టీచర్లపై సస్పెన్షన్ వేటు పడింది. మూల్యాంకన విధులు కేటాయించినా హాజరు కాకుండా నిర్లక్ష్యం వహించిన కాసిపేట జెడ్పీహెచ్‌ఎస్ ఉపాధ్యాయురాలు లలిత, దొడపల్లి పాఠశాలకు చెందిన వసంత, మైలారం పాఠశాలకు చెందిన పుష్పలతను సస్పెండ్ చేసినట్లు డీఈవో యాదయ్య ప్రకటించారు. మూల్యాంకనం విధులు వేసి రిలీవ్ చేసిన ఉపాధ్యాయులను స్పాట్ వాల్యూయేషన్ శిబిరం నుంచి రిలీవ్ చేసే వరకు పాఠశాలలో చేర్చుకోరాదని ఆదేశించారు. దీంతో స్పాట్ వాల్యూయేషన్‌కు దూరంగా ఉన్న కొందరు ఉపాధ్యాయులు రిపోర్టు చేసేందుకు బారులు తీరారు. బుధవారం పొద్దుపోయాక కూడా రిపోర్టు చేయకుండా నిర్లక్ష్యం వహించిన ముగ్గురిని సస్పెండ్ చేశారు.

లండన్ అమ్మాయి.. బెల్లంపల్లి అబ్బాయి



వధూవరులు

బెల్లంపల్లి: లండన్ అమ్మాయి.. బెల్లంపల్లి అబ్బాయి పరిచయం ప్రేమగా మారింది.. ఒకరినొకరు ఇష్టపడ్డారు.. దేశాలు వేరైనా మూడు ముళ్ల బంధంతో ఒక్కటయ్యారు. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలం పాత బెల్లంపల్లి గ్రామానికి చెందిన కర్రె రాజు కొన్నాళ్ల క్రితం లండన్‌కు వెళ్లాడు. అక్కడ ఓ షాపింగ్‌మాల్‌లో పని చేస్తుండగా దయానా అనే యువతితో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం ప్రేమకు దారి తీసింది. ఆ తర్వాత ఇద్దరూ కలిసి సొంతంగా వ్యాపారం చేస్తున్నారు. ఆచారాలు, సంప్రదాయాలు వేరైనా పెద్దల సమక్షంలో హిందూ సంప్రదాయబద్ధంగా పెళ్లి చేసుకోవాలని నిశ్చయించుకున్నారు. బెల్లంపల్లిలోని ఏఆర్ కన్వెన్షన్‌లో గురువారం రాజు దయానాకు తాళి కట్టి తన జీవిత భాగస్వామిని చేసుకున్నాడు. చీరకట్టుతో పెళ్లిపీటలపై కూర్చున్న వధువు దయానా అందరి దృష్టిని ఆకర్షించింది. వీరి పెళ్లికి వధువు తల్లిదండ్రులు రాకపోవడంతో రాజు కుటుంబీకులు అన్నీ తామై వ్యవహరించి పెళ్లి జరిపించారు.

ముందస్తు రాయితీ



మంచిర్యాల మున్సిపల్ కార్యాలయం

- మున్సిపాలిటీల్లో ఆస్తిపన్ను చెల్లింపుపై అమలు
- పూర్తి పన్ను చెల్లించిన వారికి ఎర్లీబర్డ్ పథకం
- పన్నులు వసూలైతేనే బల్దియాలకు నిధులు
- గత ఆర్థిక సంవత్సరం వసూళ్లు అంతంత మాత్రమే

మంచిర్యాలటౌన్: జిల్లాలోని మున్సిపాలిటీల్లో ముందస్తుగా ఆస్తిపన్ను చెల్లించేందుకు ప్రభుత్వం ఎర్లీబర్డ్ పథకం అమలు చేస్తోంది. ఈ పథకం ద్వారా చెల్లించిన వారికి పన్నులో ఐదు శాతం రాయితీ కల్పిస్తోంది. గత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తిపన్ను వసూళ్లు మార్చి నెలాఖరున ముగిశాయి. నూతన ఆర్థిక సంవత్సరం ఆరంభంతో ముందస్తు పన్ను చెల్లింపులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. గత ఆర్థిక సంవత్సరంలో పన్ను బకాయిల వసూళ్లు అంతంత మాత్రంగానే కావడం, మున్సిపాలిటీ అభివృద్ధికి పన్ను వసూళ్లు కాకపోవడంతో అభివృద్ధి కుంటుపడడం వంటివి జరగకుండా ఉండేందుకు 2024 మార్చి వరకు ఉన్న పూర్తి పన్ను బకాయిలను చెల్లించిన వారికి 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పన్నును చెల్లించేందుకు ఈ పథకాన్ని మరోసారి అమల్లోకి తీసుకొస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. బకాయిలు పేరుకుపోకుండా ముందస్తు పన్ను చెల్లింపులను ప్రోత్సహించడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశం. 5శాతం రాయితీ అందిస్తుండడంతో ప్రజలకు ఈ పథకం ప్రయోజనం చేకూరుస్తుంది. ఏప్రిల్ 30వ తేదీలోపు పన్ను చెల్లిస్తేనే ఈ పథకం వర్తిస్తుందని అధికారులు పేర్కొన్నారు.

ప్రచారం కల్పిస్తేనే..

ఎర్లీబర్డ్ పథకానికి సంబంధించి మున్సిపల్, రెవెన్యూ సిబ్బంది ఇప్పటి నుంచే ప్రచారం చేపట్టి పన్నులు వసూలు చేయాలి. సరైన ప్రచారం లేకపోవడంతో గత ఏడాది చాలామందికి ఈ పథకం, రాయితీ విషయం తెలియక పన్నులు చెల్లించలేదు. దీంతో మొన్నటి ఆర్థిక సంవత్సరంలో పన్నుల వసూలు మున్సిపల్ అధికారులు, సిబ్బందికి సవాలుగా మారింది. ఈ పథకంపై విస్తృత ప్రచారం కల్పించాలని ఇప్పటికే మున్సిపల్ కమిషనర్లను సీడీఎంఏ అధికారులు ఆదేశించారు. ప్రజలకు అవగాహన కల్పించి ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకునేలా ముందుకు వచ్చేందుకు కృషి చేయాలని తెలిపారు. గత మార్చి 2024 వరకు పన్ను బకాయిలు పూర్తిగా చెల్లించని వారికి ఈ పథకం వర్తించదని, పూర్తి బకాయిలు చెల్లించిన వారు మాత్రమే ఈ పథకానికి అర్హులనే విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి ఎర్లీబర్డ్ ద్వారా పన్ను ముందస్తు చెల్లింపులను చేపట్టేందుకు మున్సిపల్ అధికారులు సమాయత్తం అయ్యారు. ప్రజలు కూడా ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకుంటే పన్ను బకాయిలు ఉండకుండా, 5 శాతం రాయితీని పొందేందుకు అవకాశం ఉంది.

సద్వినియోగం చేసుకోవాలి



అన్ని మున్సిపాలిటీల్లోనూ 31 మార్చి 2024 వరకు ఇంటిపన్నును పూర్తిగా చెల్లించిన వారికి మాత్రమే ఎర్లీబర్డ్ స్కీం ఆఫర్ వర్తిస్తుంది. ఎర్లీబర్డ్ స్కీమ్ అనేది 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించింది. 1-4-2024 నుంచి 31-03-2025 వరకు అడ్వాన్స్‌గా ఆస్తి పన్ను చెల్లించే వారికి 5శాతం రాయితీని కల్పించగా, ఈ అవకాశం ఈ నెల 30వరకు మాత్రమే అందుబాటులో ఉంటుంది. ఈ సదావకాశాన్ని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకుని ముందస్తు పన్నులను 5 శాతం రాయితీతో చెల్లించాలి.

– మారుతిప్రసాద్, మంచిర్యాల మున్సిపల్ కమిషనర్

జిల్లాలోని మున్సిపాలిటీల్లో 2023-24 ఆర్థిక సంవత్సరంలో వసూలు చేసిన ఆస్తిపన్ను వివరాలు

మున్సిపాలిటీ	మొత్తం ఇళ్లు	డిమాండ్(రూ.కోట్లలో)	వసూళ్లు(రూ.కోట్లలో)	వసూలు శాతం
మంచిర్యాల	26,552	17.73	11.41	65.93
నస్పూరు	16,026	4.98	2.82	56.52
క్యాతన్‌పల్లి	11,851	4.15	3.33	80.17
బెల్లంపల్లి	12,671	4.64	2.36	50.79
మందమర్రి	13,260	2.89	1.54	53.20
లక్సెట్టిపేట	5,726	1.39	1.27	58.16
చెన్నూరు	6,588	2.52	1.14	55.94

న్యూట్రీషన్ కిట్ల పంపిణీకి బ్రేక్..!

- మూడు నెలలుగా పెండింగ్
- గర్భిణుల ఎదురుచూపులు



చెన్నూర్ సీహెచ్‌సీలో గర్భిణులు

చెన్నూర్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో గర్భిణులకు అందజేసే న్యూట్రీషన్ కిట్ల పంపిణీకి బ్రేక్ పడింది. మూడు నెలలుగా పంపిణీకి నోచుకోకపోవడంతో ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. గర్భిణుల్లో రక్తహీనతను అధిగమించడానికి 2023లో అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం న్యూట్రీషన్ కిట్ల పంపిణీకి శ్రీకారం చుట్టింది. నిరుపేద గర్భిణులకు న్యూట్రీషన్ కిట్లు పంపిణీ చేయడంతో ఆరోగ్యపరంగా మేలు జరిగింది. కిట్ల పంపిణీ నిలిచిపోవడంతో బలవర్ధకమైన ఆహార పదార్థాల కొనుగోలుకు ఆర్థిక భారం పడుతోంది. నిరుపేదలకు విటమిన్లతో కూడిన పదార్థాలు కొనుగోలు చేయాలంటే ఇబ్బంది పడాల్సిన దుస్థితి నెలకొందని పలువురు మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో..

జిల్లాలో నాలుగు ప్రభుత్వ ఆస్పత్రులు, 17పీహెచ్‌సీలు, మూడు సీహెచ్‌సీలు, ఒక ఎంసీహెచ్, ఏరియా ఆస్పత్రి ఉన్నాయి. జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో 358 మంది గర్భిణులు నమోదు చేసుకుని ఉన్నారు. కిట్టులో రూ.2వేల విలువైన కిలో న్యూట్రీషన్ మిక్స్‌డ్ పౌడర్, కిలో కర్జూర, మూడు ఐరన్ సిరప్ బాటిళ్లు, 200 గ్రాములు పల్లిపట్టీలు, 500 గ్రాముల నెయ్యి, ప్లాస్టిక్ బాస్కెట్ ఉంటాయి. గర్భం దాల్చిన నాలుగో నెలకు ఒకటి, ఎనిమిదో నెలకు మరొకటి చొప్పున రెండు దఫాలుగా గర్భిణులకు కిట్లు అందజేసేవారు. ఒక్కో కిట్టు విలువ రూ.2వేల చొప్పున రెండు కిట్లకు రూ.4వేల వరకు ప్రయోజనం చేకూరింది. కిట్ల పంపిణీ నిలిచిపోవడంతో నిరుపేద గర్భిణులు న్యూట్రీషన్ కొనుగోలుకు ఇబ్బంది పడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం న్యూట్రీషన్ కిట్ల పంపిణీని కొనసాగించాలని గర్భిణులు కోరుతున్నారు.

ఇప్పటివరకు ఒక్కటి రాలే..



నాకు ఆరు నెలలు.. నాలుగు నెలలకు ఒక న్యూట్రీషన్ కిట్టు ఇస్తారని చెప్పారు. ఇప్పటివరకు ఇవ్వలేదు. మూడు నెలల నుంచి కిట్లు రావడం లేదని అంటున్నా రు. గర్భిణులకు న్యూట్రీషన్ కిట్లు ఇస్తే మేలు జరుగుతుంది. – ఎర్ల సుప్రియ, చెన్నూర్

కిట్లు రాగానే అందజేస్తాం..

ప్రస్తుతం న్యూట్రీషన్ కిట్లు అందుబాటులో లేవు. గత రెండు నెలల నుంచి కిట్లు రావడం లేదు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. కిట్లు రాగానే గర్భిణులకు అందజేస్తాం.

– డి.సత్యనారాయణ, సూపరింటెండెంట్, సీహెచ్‌సీ చెన్నూర్

తాగునీటి సరఫరాకు చర్యలు

- ప్రత్యేక కార్యదర్శి, కార్మికశాఖ సంచాలకులు కృష్ణ ఆదిత్య



సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్యేక కార్యదర్శి, కార్మిక శాఖ సంచాలకులు కృష్ణ ఆదిత్య

నస్పూర్: వేసవి కాలం పూర్తయ్యే వరకు ప్రతీ ఇంటికి నిరంతరం తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని ప్రత్యేక కార్యదర్శి, కార్మిక శాఖ సంచాలకులు కృష్ణ ఆదిత్య అన్నారు. గురువారం ఆయన నస్పూర్‌లోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంచిర్యాల, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాల కలెక్టర్లు బదావత్ సంతోష్, వెంకటేశ్ ధోత్రే, అదనపు కలెక్టర్లు బి.రాహుల్, దీపక్ తివారీలతో కలిసి మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మండల పంచాయతీ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, మిషన్ భగీరథ ఏఈలతో వేసవి కాలం తాగునీటి ప్రణాళిక అమలుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మిషన్ భగీరథ గ్రిడ్ ద్వారా ప్రతీ ఇంటికి అందుతున్న తాగునీటి సరఫరా ప్రక్రియను ఎప్పటికప్పుడు పరిశీలించాలని, ఏమైనా ఇబ్బందులు ఉంటే చర్యలు చేపట్టాలని సూచించారు. మంచిర్యాల జిల్లా జన్నారం మండలానికి కడెం ప్రాజెక్టు ద్వారా, బెల్లంపల్లి నియోజకవర్గంలోని ఏడు మండలాలకు కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా అడ ప్రాజెక్టు ద్వారా తాగునీటిని సరఫరా చేస్తామని తెలిపారు. మున్సిపాలిటీల్లో ఓహెచ్‌ఎస్‌ఆర్ ట్యాంకులు, పవర్ బోర్స్ పాయింట్ల ద్వారా సరిపడా నీటిని అందించాలని తెలిపారు. ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా నీటి సరఫరాకు ఏర్పాట్లు చేయాలని అన్నారు. గ్రామ పంచాయతీ, మిషన్ భగీరథ, మండల పరిషత్ అధికారులు సమన్వయంతో పని చేస్తూ గ్రామ స్థాయిలో ప్రణాళికలు రూపొందించుకుని ప్రతీ ఇంటికీ తాగునీరు అందించేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. కలెక్టర్ సంతోష్ మాట్లాడుతూ మిషన్ భగీరథ గ్రిడ్ ద్వారా సరఫరా అయ్యే తాగునీటిపై ప్రతీరోజు పర్యవేక్షిస్తున్నామని, అవసరం ఉన్న ప్రాంతాల్లో బోర్‌వెల్‌లు అద్దెకు తీసుకుని నీటిని సరఫరాకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

- ఫైర్ సేఫ్టీ తనిఖీలు నిర్వహించాలి
- రామగుండం సీపీ శ్రీనివాసులు



షీ టీమ్ సిబ్బందితో సీపీ శ్రీనివాసులు

మంచిర్యాలక్రైం: వేసవికాలం దృష్ట్యా అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని రామగుండం పోలీసు కమిషనర్ శ్రీనివాసులు అన్నారు. గురువారం రామగుండం కమిషనరేట్ ఆవరణలో మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల సింగరేణి ఫైర్‌సేఫ్టీ, అగ్నిమాపక శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షార్ట్‌సర్క్యూట్ వల్ల అధిక శాతం ప్రమాదాలు జరుగుతాయని, విధిగా వాణిజ్య సముదాయాలు, బహుళ అంతస్తుల ఆస్పత్రులు, పాఠశాలలు, అపార్టుమెంట్లు, ఫైర్ సేఫ్టీపై తనిఖీలు నిర్వహించాలని అన్నారు.

మహిళలు మౌనంగా ఉండొద్దు

మంచిర్యాలక్రైం: వేధింపులకు గురైన మహిళలు మౌనంగా ఉండొద్దని, ఫిర్యాదు చేస్తే తక్షణమే చర్యలు తీసుకుంటామని సీపీ శ్రీనివాసులు అన్నారు. గురువారం కమిషరేట్ ఆవరణలో మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల షీ టీమ్ పోలీసులతో కాఫీ విత్ షీ టీమ్ మెంబర్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ 100డయల్, షీ టీమ్ వాట్సాప్ నంబర్ 6303923700కు ఫిర్యాదు చేయొచ్చని అన్నారు. అనంతరం షీ టీమ్ సిబ్బందికి ప్రశంస పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ రాజు, ఎస్‌బీ ఏసీపీ రాఘవేంద్రరావ్, షీ టీమ్ పోలీసులు పాల్గొన్నారు.

'బీజేపీ అధికారంలోకి వస్తే పేదలకు మేలు'



చెన్నూర్‌లో ప్రచారం చేస్తున్న శ్రీనివాస్

చెన్నూర్: కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వస్తేనే పేదలకు మేలు జరుగుతుందని ఆ పార్టీ పెద్దపల్లి లోక్‌సభ అభ్యర్థి గోమాసే శ్రీనివాస్ అన్నారు. గురువారం చెన్నూర్ పట్టణంలోని ప్రధాన వీధుల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గోమాసే శ్రీనివాస్ మాట్లాడుతూ విద్య, వైద్యానికి కేంద్ర ప్రభుత్వం పెద్దపీట వేసిందని తెలిపారు. పెద్దపల్లిలో భారీ మెజార్టీతో గెలిపించి మోదీ నాయకత్వాన్ని బలపర్చాలని ప్రజలను కోరారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్, నియోజకవర్గ నాయకులు దుర్గం అశోక్, నాయకులు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్, కొండపాక చారి పాల్గొన్నారు.

వాగులో బోరు.. తోటకు నీరు



తోటలో నీటి కోసం వేసిన పైపు

భీమిని: కన్నెపల్లి మండల కేంద్రంలో బోరు నీరు వాడడం లేదు. పంట పొలాలు, కూరగాయల తోటలకు నీరు అందించాలంటే వాగులో బోరు వేసి పైపులైన్ల ద్వారా నీటితడులు అందించాల్సిందే. మండల కేంద్రంలో బోర్‌వెల్ సుమారు 300పైగా ఫీట్ల లోతు వేసినప్పటికీ నీరు రాని పరిస్థితి నెలకొంది. కన్నెపల్లిలో వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నారు. వరి, పత్తి, టమాటా, వంకాయ, అల్చంత, బీర, కాకర మొదలైన కూరగాయల సాగుతోపాటు పసుపు, అరుదుగా లభించే రథాలం పంటలను పండిస్తారు. నీటితడుల కోసం కష్టాలు పడుతూ వాగు మధ్యలో బోరు వేసి అక్కడి నుంచి వందల మీటర్లు పైపులు అమర్చుతున్నారు.

హడలెత్తిస్తున్న ఏనుగు

- 24 గంటల వ్యవధిలో గజరాజు దాడిలో ఇద్దరు మృతి
- ఐదు మండలాల్లో 144 సెక్షన్ విధింపు
- అడుగడుగునా అటవీశాఖ వైఫల్యం
- సమీప గ్రామాలను అప్రమత్తం చేస్తున్న అధికారులు
- ఉన్నతాధికారుల పర్యవేక్షణ



కొండపల్లిలో ప్రజలతో మాట్లాడుతున్న అటవీ, పోలీసు అధికారులు

చింతలమానెపల్లి: జిల్లా ప్రజలను గజరాజు హడలెత్తిస్తున్నాడు. 24 గంటల వ్యవధిలోనే ఇద్దరు రైతులు ఏనుగు దాడిలో మృత్యువాత పడటంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఆచూకీ చిక్కకుండా తిరుగుతున్న ఏనుగు గ్రామీణులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. రెండేళ్ల క్రితం ఇదే ప్రాంతంలో దహెగాం, కొండపల్లి గ్రామాలకు చెందిన ఇద్దరిని పెద్దపులి హతమార్చగా.. ఇప్పుడు ఏనుగు రూపంలో మృత్యువు వెంటాడుతోందని ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు.

ఇద్దరు రైతుల మృతి..

బూరెపల్లి సమీపంలోని ప్రాణహిత నదిలో బుధవారం తెల్లవారుజామున ఏనుగును కొంతమంది గ్రామస్తులు గమనించి అటవీ అధికారులకు సమాచారం అందించారు. సమాచారాన్ని విశ్వసించని అటవీ అధికారులు ఏనుగును నియంత్రించకపోవడంతో అది నది దాటి చింతలమానెపల్లి మండలంలోకి ప్రవేశించింది. ఉదయం 11 గంటల సమయంలో బూరెపల్లి సమీపంలోని వ్యవసాయ భూముల వద్దకు వచ్చిన ఏనుగు అక్కడే మిరపతోటలో పని చేస్తున్న రైతు అల్లూరి శంకర్‌పై దాడి చేసి చంపేసింది. ఆందోళనకు గురైన గ్రామస్తులు ఏనుగును తరిమేందుకు ప్రయత్నించారు. అక్కడికి చేరుకున్న అటవీశాఖ అధికారులు దానిని అనుసరించగా.. అది గంగాపూర్, ఖర్జెల్లి గ్రామాల పక్కన ఉన్న ప్రాణహిత చేవేళ్ల ప్రాజెక్టు కాలువ పక్క నుంచి రుద్రాపూర్ గ్రామం వద్దకు చేరుకుంది. అక్కడి నుంచి అధికారులు ఏనుగు కదలికలను గుర్తించలేదు. మళ్లీ గురువారం తెల్లవారుజామున పెంచికల్‌పేట్ మండలం కొండపెల్లి గ్రామానికి చెందిన కారు పోశన్న(60)పై దాడి చేసి చంపింది. అదే గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ ఎల్కరి సుధాకర్‌ను వెంబడించగా పారిపోయి తప్పించుకున్నాడు. ఈ క్రమంలో ఏనుగు పలువురికి చెందిన తోటలు, పంటలు ధ్వంసం చేసింది. చింతలమానెపల్లి మండలం నుంచి బెజ్జూర్, పెంచికల్‌పేట్ మండలాల్లో సంచరించింది. ఈ మండలాలతోపాటు పక్కన ఉన్న కౌటాల, దహెగాం మండలాలు కలిపి రెండు రోజులుగా ఏనుగు ఐదు మండలాల ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది.

ఒడిశా, ఛత్తీస్‌గఢ్ నుంచి తెలంగాణకు..

కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోకి ప్రవేశించిన ఏనుగు ఎక్కడి నుంచి వచ్చింది అనే విషయాన్ని అటవీశాఖ ధ్రువీకరించడం లేదు. ఇప్పటివరకు కచ్చితమైన సమాచారం లేకపోవడంతో అధికారులు ఎలాంటి వివరాలు వెల్లడించడం లేదు. కాగా గత మంగళవారం ఏనుగు బూరెపల్లి వద్ద ప్రాణహిత నదికి అవతలి వైపు ఉన్న చౌడంపల్లి అటవీ ప్రాంతంలో సంచరించినట్లు అక్కడి ప్రజలు తెలిపారు. చింతలమానెపల్లి మండలానికి సుమారు 70 కిలోమీటర్ల దూరంలోని గడ్చిరోలి జిల్లా రేపన్‌పల్లి రేంజ్ పరిధిలోని కమలాపూర్‌లో ఏనుగుల సంరక్షణ కేంద్రం ఉంది. అక్కడి అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ ఏనుగు అడవుల్లో సంచరించేది. దక్షిణ గడ్చిరోలి ప్రాంతంగా పిలిచే మాలెవాడ, మురుంగావ్ ప్రాంతం ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రకు సరిహద్దుగా ఉంది. ఛత్తీస్‌గఢ్‌లోని దట్టమైన అభయారణ్యం ఒడిశా రాష్ట్రంలోని అటవీ ప్రాంతంతో కలిసి ఉంటుంది. కొన్నేళ్లుగా ఇక్కడి ప్రాంతంలో ఏనుగుల సంచారం ఉంది. మూడేళ్ల క్రితం మాలెవాడ అటవీ ప్రాంతానికి 25 నుంచి 30 ఏనుగుల బృందం వచ్చినట్లు అక్కడి అటవీ అధికారులు గుర్తించారు. ఈ ప్రాంతంలోని ఏనుగుల గుంపు నుంచే ఓ ఏనుగు ఇక్కడికి వచ్చినట్లుగా తెలుస్తోంది. గడ్చిరోలి నుంచి వంద కిలోమీటర్ల దూరంలో ఉన్న ధనోరాలో ఈ ఏనుగుల గుంపు కొద్ది నెలలుగా తీవ్ర విధ్వంసం సృష్టిస్తున్నట్లు అక్కడి అధికారులు తెలిపారు. ఓ డ్రైవర్ సహా మరో ముగ్గురిపై దాడి చేసి చంపేశాయి. ఈ ఏనుగులు కర్ణాటక రాష్ట్రం నుంచి అటవీ ప్రాంతం గుండా గడ్చిరోలిలోని మాలెవాడ అటవీ ప్రాంతానికి చేరుకున్నట్లు వారు చెబుతున్నారు.

అటవీశాఖపై విమర్శలు

బూరెపల్లి వద్ద ఏనుగు సంచరిస్తున్న సమాచారాన్ని అటవీశాఖకు చేరవేసినా అధికారులు పట్టించుకోలేదని స్థానికుల నుంచి విమర్శలు వస్తున్నాయి. సరైన సమయంలో స్పందించని కారణంగానే అల్లూరి శంకర్ ఏనుగు దాడిలో మరణించాడని ఆరోపిస్తున్నారు. ఒకరిపై దాడి చేసిన అనంతరం స్వయంగా జిల్లా అటవీ అధికారి పర్యవేక్షణలో ఉండగానే పెంచికల్‌పేట్ మండలంలోని కొండపల్లి వద్ద మరొకరు ఏనుగు దాడిలో మృతి చెందడంపై ప్రజల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. పరిసర గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయడంలో అటవీశాఖ నిర్లక్ష్యం వహించిందని, గోప్యత పాటించడంతోనే ప్రమాదాలు పెరుగుతున్నాయని మండిపడుతున్నారు. కాగజ్‌నగర్ డివిజన్ పరిధిలో కొన్ని నెలల క్రితం అటవీ అధికారుల నిర్లక్ష్యంతో రెండు పులులు మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో అధికారులను బాధ్యులు చేస్తూ ఆ శాఖ ఉన్నతాధికారులు పలువురిపై వేటు వేశారు.

ఉన్నతాధికారుల పర్యవేక్షణ...

ఎస్పీ సురేశ్‌కుమార్, అటవీ కన్జర్వేటర్ శాంతారాం, జిల్లా అటవీ అధికారి నీరజ్ టోబ్రివాల్, డీఎస్పీ కరుణాకర్ స్వయంగా ఆయా మండలాలలో పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. అధికారులు చింతలమానెపల్లి, కౌటాల, బెజ్జూర్, పెంచికల్‌పేట్, దహెగాం మండలాలలో 144 సెక్షన్ విధించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేశారు. సోషల్ మీడియా ద్వారా ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

లోడుపల్లి అడవుల్లోకి గజరాజు



రహదారి మీదుగా వెళ్తున్న ఏనుగు

పెంచికల్‌పేట్(సిర్పూర్): పెంచికల్‌పేట్ మండలం కొండపల్లిలో గురువారం వేకువజామున రైతును చంపిన ఏనుగు మళ్లీ రాత్రి 8 గంటలకు బెజ్జూర్ నుంచి పెంచికల్‌పేట్ వెళ్తున్న ఆర్టీసీ బస్సుకు కొండపల్లి టర్నింగ్ వద్ద ఎదురొచ్చింది. ఘటనా స్థలానికి చేరుకున్న పీసీసీఎఫ్ శాంతారాం, డీఎఫ్‌వో నీరజ్ కుమార్ ఏనుగు సంచారాన్ని నిర్ధారించారు. లోడుపల్లి అడవుల్లోకి వెళ్లిందని తెలిపారు. అటవీశాఖ అధికారులు ఇచ్చిన సమాచారంతో ఎస్సై కొమురయ్య ఆధ్వర్యంలో పెంచికల్‌పేట్– సలుగుపల్లి రహదారిలో రాకపోకలను నిలిపివేశారు.

నా వెంట పడింది.



ఉదయం పూట కొండపెల్లి సమీపంలో వాకింగ్‌కు వెళ్లా. పక్కనే ఉన్న వ్యవసాయ భూమి వైపు నుంచి ఏనుగు ఘీంకరించిన శబ్దం వినిపించింది. దూరంగా ఉన్న ఇద్దరు మిత్రులను అప్రమత్తం చేస్తూ అరవడంతో ఏనుగు నా వెంట పడింది. కొద్దిదూరం వరకు పరుగెత్తుతూ వెళ్లడంతో ఏనుగు నుంచి తప్పించుకున్నా. కొండెపల్లిలోని వారికి ఫోన్ ద్వారా సమాచారం అందించి అప్రమత్తం చేశారు. నా వెంట ఉన్న మరో ఇద్దరు సంజీవ్, శ్రీకాంత్‌లతో ఏనుగు ఉన్న స్థలంలో చూడడానికి వెళ్లగా అక్కడ కారు పోశన్న మృతదేహం కనిపించింది.

– ఎల్కరి సుధాకర్, పెంచికలపేట్

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఆసిఫాబాద్అర్బన్: జిల్లాలో ఏనుగు దాడిలో ఇద్దరు మృతిచెందిన నేపథ్యంలో పెంచికల్‌పేట్, దహెగాం, చింతలమానెపల్లి, బెజ్జూర్ మండలాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సురేశ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎవరూ ఒంటరిగా చేలు, పొలాల వైపునకు వెళ్లొద్దని సూచించారు. అనవసరంగా ఇళ్ల నుంచి బయటికి రావొద్దని కోరారు. ప్రజలు ఆందోళన చెందొద్దని, ప్రత్యేక బృందాల ద్వారా ఏనుగు జాడ కోసం ప్రయత్నిస్తున్నామని తెలిపారు.

– ఎస్పీ సురేశ్‌కుమార్

క్లుప్తంగా

వృద్ధాశ్రమంలోని వృద్ధుడి మృతి



అంత్యక్రియలకు తీసుకెళ్తున్న సభ్యులు

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని శ్రీశ్రీనగర్‌లో రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమంలో ఆశ్రయం పొందుతున్న కాసిపేట మండలం సోమగూడెంకు చెందిన గడ్డం మల్లయ్య(80) అనారోగ్యంతో గురువారం మృతిచెందాడు. దీంతో రెడ్‌క్రాస్ సభ్యులు అంత్యక్రియలను నిర్వహించారు. మృతుడి బంధువులు, మాజీ సర్పంచ్ వేముల కృష్ణల సమక్షంలో రెడ్‌క్రాస్ చైర్మన్ కె.భాస్కర్ రెడ్డి, వి.మధుసూదన్ రెడ్డి, కోశాధికారి కే.సత్యపాల్ రెడ్డి, వృద్ధాశ్రమం ఇన్‌చార్జి సత్యనారాయణ రావు, నిర్వాహకులు సదానందం పాల్గొన్నారు.

గని ప్రమాదంలో కార్మికుడికి గాయాలు

బెల్లంపల్లి: మందమర్రి ఏరియా శాంతిఖని గనిలో గురువారం ప్రమాదం జరిగి ఓ జనరల్ మజ్దూర్ కార్మికుడికి గాయాలయ్యాయి. కార్మికులు తెలిపిన వివరాల ప్రకారం... గోడల శివకుమార్ అనే జనరల్ మజ్దూర్ జనరల్ షిఫ్ట్‌లో విధులకు హాజరయ్యాడు. భూగర్భంలో దిగి 47 లెవల్ మ్యాన్ రైడింగ్ కరువు స్టేషన్ వద్ద పనిచేస్తుండగా ప్రమాదం చోటుచేసుకుంది. 43 లెవల్ చైర్‌లిఫ్ట్ స్టేషన్‌కు వచ్చే క్రమంలో జామ్ అయింది. ఆ చైర్ లిఫ్టును వేరు చేస్తుండగా ప్రమాదం చోటు చేసుకుని శివకుమార్‌కుడి చేతి రెండు వేళ్ల చివరి భాగాలు తెగిపోయాయి. తీవ్ర రక్తస్రావం కాగా అతడిని అంబులెన్స్‌లో ఏరియా ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స చేయించి మెరుగైన వైద్యం కోసం గోదావరి ఖని సింగరేణి ఏరియా ఆసుపత్రికి తరలించారు.

జెడ్పీ హైస్కూల్‌లో చోరీ



చిందరవందరగా రికార్డులు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని జెడ్పీ బాలుర హైస్కూల్‌లో బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. పాఠశాల లైబ్రరీ గది తాళం పగులగొట్టి లోనికి ప్రవేశించిన వ్యక్తులు సౌండ్ సిస్టం, మౌత్‌పీస్ ఎత్తుకెళ్లారు. రికార్డులు చిందరవందర చేశారు. మొన్నటి వరకు డీఈవో కార్యాలయం ఇదే భవనంలో కొనసాగగా, కార్యాలయ రికార్డులు ఇక్కడే ఉంచారు. డీఈవో కార్యాలయ రికార్డులు సైతం చిందరవందర చేశారు. గతంలో సైతం పాఠశాల స్విచ్‌బోర్డులు ధ్వంసం చేశారు. చోరీపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు హెచ్‌ఎం సుభాష్ తెలిపారు.

మామిడి మార్కెట్‌కు మోక్షమెప్పుడో..?

- జిల్లా సౌకర్యం లేక మహారాష్ట్రకు తరలిస్తున్న మామిడి
- భాష రాక.. దళారుల చేతిలో దగా అవుతున్న రైతన్న
- దూర, ఆర్థిక భారంతో రైతుల అరిగోస



మార్కెట్‌కు తరలించేందుకు మామిడికాయలు



నాగపూర్ మార్కెట్‌లో మామిడి కొనుగోళ్ల దృశ్యం

చెన్నూర్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోనే మామిడి దిగుబడికి మంచిర్యాల జిల్లా పెట్టింది పేరు. మంచిర్యాల జిల్లాలో 18,170 ఎకరాల విస్తీర్ణంలో మామిడితోటలు ఉన్నాయి. జిల్లాలో దిగుబడి అయిన నాణ్యమైన మామిడి తెలంగాణ, మహారాష్ట్ర, గుజరాత్, ఢిల్లీ, రాష్ట్రాలతో పాటు విదేశాలకు ఎగుమతి అవుతుంది. జిల్లాలో పండించిన మామిడికి అన్ని రాష్ట్రాలలో డిమాండ్ పలుకుతున్న రైతులు అమ్ముకునేందుకు మార్కెట్ సౌకర్యం లేదు. ఇక్కడ పండించిన మామిడిని పక్క రాష్ట్రాలకు వెళ్లి అమ్ముకోవాల్సిన దుస్థితి జిల్లా రైతులది. ప్రభుత్వం జిల్లాలో మార్కెట్ సౌకర్యం ఏర్పాటు చేస్తుందని ప్రతి మామిడి సీజన్‌లో రైతులు ఎదురు చూస్తున్నారు...

ఈ నెల నుంచే రవాణా..

జిల్లాలో ఈ ఏడాది మామిడి పూత విరివిగా పూసింది. మామిడి పూత పూసిన తీరున కాయ నిలువక పోవడంతో కాయ అంతంత మాత్రంగానే ఉంది. ఉగాది పండుగ తరువాత మామిడి రవాణా కావాల్సి ఉండగా ఏప్రిల్, మే నెలలో గాలిదుమారాలు వీచి నష్టం జరిగే అవకాశాలు ఉండడంతో రైతులు ఉగాదికి ముందే మామిడిని పక్క రాష్ట్రాలకు రవాణా ప్రారంభించారు. జిల్లాలో మార్కెట్ సౌకర్యం లేక పక్క రాష్ట్రానికి వలస వెళ్తున్నారు.

నాగపూర్, నాందేడ్ మార్కెట్‌కే..

రాష్ట్రంలో వరంగల్, జగిత్యాలలో మామిడి మార్కెట్ ఉన్నప్పటికీ మంచిర్యాల జిల్లా రైతులు మహారాష్ట్రలోని నాగపూర్, నాందేడ్ మార్కెట్‌కు వెళ్తున్నారు. జిల్లా రైతులు అనాధిగా నాగపూర్, నాందేడ్ మార్కెట్‌కు వెళ్లడం అలవాటుగా మారిందని రైతులు పేర్కొంటున్నారు. గతంలో నాగపూర్, నాందేడ్ మార్కెట్‌లో వ్యాపారాలు బాగుండేదని, ప్రస్తుతం దళారుల మోసాలు ఎక్కువయ్యాయని పేర్కొంటున్నారు.

భాష రాక మోస పోతున్న రైతులు..

మహారాష్ట్రలోని నాగపూర్, నాందేడ్ మార్కెట్‌లో వ్యాపారులంతా మరాఠి మాట్లాడుతారు. జిల్లా రైతులకు భాష రాకపోవడంతో వారు ఎంతకు భేరమడుతున్నారు. ఎంత చెల్లిస్తున్నారనే విషయం రైతు చేతికి డబ్బులు వచ్చే వరకు క్వింటాల్‌కు ఎంత చెల్లిస్తున్నారనే విషయం తెలియని పరిస్థితి నెలకొందని పలువురు రైతులు పేర్కొనడం గమనార్హం.

బెల్లంపల్లిలో నిరుపయోగంగా షెడ్డు..

గతంలో మామిడి మార్కెట్ కోసం బెల్లంపల్లిలో షెడ్డు నిర్మించి వదిలేశారు. నేడు షెడ్డు ఆనవాళ్లు లేకుండా పోయిందని రైతులు అంటున్నారు. మామిడి మార్కెట్ ప్రతిపాదనలకు పరిమితమవుతుందని రైతులు ఆరోపిస్తున్నారు. బెల్లంపల్లిలో కాకుండా మంచిర్యాల జిల్లా కేంద్రంలో మార్కెట్ సౌకర్యం ఏర్పాటు చేసి అన్ని మండలాల లాభం చేకూరుతుందని రైతులు అంటున్నారు.

దూరభారం, ఆర్థిక భారం...

రైతులు మామిడి విక్రయించేందుకు నాగపూర్, నాందేడ్ మార్కెట్‌కు వెళ్లాలంటే పెద్ద వాహనానికి రూ.26వేల నుంచి రూ.30వేలు, చిన్న వాహనానికి రూ.16వేల నుంచి 18వేలు అవుతుంది. ప్రభుత్వం జిల్లాలో మార్కెట్ సౌకర్యం కల్పిస్తే ఆర్థిక భారంతో పాటు దూర భారం తగ్గి మేలు జరుగుతుందని రైతులు అంటున్నారు. ప్రభుత్వం జిల్లాలో మామిడి మార్కెట్ కల్పించాలని కోరుతున్నారు.

పట్టుపురుగుల సాగుతో ఆదర్శం..

- మొట్టమొదటి రైతుగా మధుకర్‌కు గుర్తింపు
- ఎకరన్నర భూమిలో షెడ్డు, మల్బరీ తోటలు
- లాభాలే ధ్యేయంగా ముందుకు..
- తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు..



మల్బరీ తోట



షెడ్డులో పట్టుపురుగులను పెంచుతున్న రైతు

చెన్నూర్‌రూరల్: రైతులు ఈ రోజుల్లో అధిక లాభాల కోసం వాణిజ్య పంటల వైపు మొగ్గు చూపుతున్నారు. లాభాలే ధ్యేయంగా వ్యవసాయం చేస్తున్నారు. పత్తి, మిర్చి పంటలను ఎక్కువ మొత్తంలో సాగు చేస్తున్నారు. కానీ చెన్నూర్ పట్టణానికి చెందిన మద్ద మధుకర్ అనే రైతు మాత్రం మండలంలోని లంబడిపల్లి గ్రామంలో తనకున్న ఆరు ఎకరాల్లో మామిడితోటతో పాటు ఎకరమున్నరలో మల్బరీ తోటతో పాటు పట్టు పురుగులను పెంచుతున్నాడు. వీటిని పెంచుతున్న మొట్టమొదటి రైతు మధుకర్. 2018లో అక్కడే రూ.4లక్షలతో షెడ్డును నిర్మించి పట్టు పురుగులను పెంచుతూ లాభాలు ఆర్జిస్తున్నాడు. వేరే కూలీలను పెట్టుకోకుండా ఒక్కడే పట్టుపురుగుల పెంపకం చేస్తున్నాడు. మొదట్లో 50గుడ్లను తీసుకురాగా వాటితో సుమారు రూ.25వేల వరకు లాభం పొందినట్లు రైతు తెలిపాడు. అలాగే రెండోవ పంటకు 100గుడ్లను తీసుకురాగా 80కిలోల పట్టుపురుగు తయారైంది. వీటిని విక్రయించగా రూ.40వేలు వచ్చాయి. ఇలా ప్రతి ఏటా రెండుసార్లు పట్టు పురుగులను పెంచుతున్నాడు.

మరోవారం రోజుల్లో పంట చేతికి...

ఈ ఏడు మార్చి నెల మొదటి వారంలో బెంగుళూరు నుంచి పట్టుపురుగుల గ్రుడ్లను తెప్పించాడు. ప్రస్తుతం రూ.850లకు 75 గుడ్లను తీసుకొచ్చిన వాటిని ట్రేలలో ఉంచగా సుమారు 35వేల వరకు పిల్లలు వచ్చాయి. 28రోజుల వరకు వాటి నోటి నుంచి దారం తీసి పట్టుగూళ్లను తయారు చేసుకుంటాయి. పట్టు పురుగులు 28 రోజుల్లో వాటి నోటి నుంచి దారాలు తీసి కాయలుగా మారుతాయి. ఆ తరువాత 11రోజులకు కాయల నుండి రెక్కల పురుగు బయటకు వచ్చి మగ పురుగుతో జతకట్టి గుడ్లు పెట్టి రెండు రోజులకు చనిపోతుంది. పట్టుపురుగు జీవిత కాలం మొత్తం 41రోజులు ఉంటుంది. ఆ తరువాత పట్టుకాయలను తీసుకెళ్లి అమ్మడం జరుగుతుందని రైతు చెప్పాడు.

సబ్సిడీ కరువు...

గతంలో ప్రభుత్వం కిలో పట్టుగూళ్లకు రూ.75 సబ్సిడీ చొప్పున అందించేది. ప్రస్తుతం ఎలాంటి సబ్సిడీ అందించడం లేదని రైతు తెలిపాడు. పట్టుగూళ్లను హైదరాబాద్‌లోని తిరుమలగిరికి తీసుకెళ్లి వేలంలో విక్రయిస్తున్నట్లు సదరు రైతు పేర్కొంటున్నాడు. పట్టుగూళ్ల నాణ్యతను బట్టి కిలోకు రూ.400 నుంచి రూ.650 వరకు మద్దతు ధర లభిస్తుందని తెలిపాడు. గతంలో మధుకర్ ఉత్తమ రైతుగా చెన్నూర్ ఏడీఏ కార్యాలయంలో అవార్డును కూడా అందుకున్నాడు.

పట్టు పురుగుల పెంపకం మంచిది



2018లో షెడ్డును ఏర్పాటు చేసి పట్టు పురుగులను పెంచడం మొదలుపెట్టాను. కూలీలు కూడా అవసరం లేదు. మొదటి పంటతో నాకు మంచి అనుభవమైంది. ఇప్పుడు పట్టుపురుగులను పెంచడం ఆరోసారి. తక్కువ ఖర్చు మంచి ఆదాయం ఉంటుంది. రెతులు ఇలాంటి పంటలు సాగు చేసే విధంగా ప్రభుత్వం చూడాలి. రైతులను ప్రోత్సహించాలి.

-మద్ద మధుకర్, పట్టు రైతు

సర్ఫేస్ జనరల్ మజ్దూర్‌కు డిమాండ్

- ప్రమోషన్లలో అండర్ గ్రౌండ్ జనరల్ మజ్దూర్లకే అవకాశం
- నిబంధన సవరించాలని డిమాండ్
- సానుకూలంగా యాజమాన్యం
- ఎన్నికల కోడ్‌తో ఉత్తర్వులు ఆలస్యం

శ్రీరాంపూర్: సింగరేణిలో సర్ఫేస్ జనరల్ మజ్దూర్ డిజిగ్నేషన్‌కు రోజురోజుకూ డిమాండ్ పెరుగుతోంది. ఈ డిజిగ్నేషన్‌లోనే పని చేయడానికి కార్మికులు ఉత్సాహకత చూపుతున్నారు. సర్ఫేస్‌లో శారీరక శ్రమ తక్కువగా ఉండడమే ఇందుకు కారణం. ఇటీవల కారుణ్య ఉద్యోగాలతో గడిచిన నాలుగేళ్లుగా కంపెనీలో చేరిన యువ ఉద్యోగులంతా ఈ డిజిగ్నేషన్‌లో పని చేయడానికే ఇష్టపడుతున్నారు. ప్రస్తుతం కంపెనీలోని నిబంధనల ప్రకారం కేవలం అండర్‌గ్రౌండ్ జనరల్ మజ్దూర్లకే సర్ఫేస్ జనరల్ మజ్దూర్లుగా ప్రమోషన్ పొందే అవకాశం ఉంది. కంపెనీ నిబంధనలు అండర్ గ్రౌండ్ జనరల్ మజ్దూర్లకు అనుకూలంగా ఉండగా మిగితా వారికి ఆటకంగా మారాయి. దీంతో మిగితా వారు ఈ నిబంధనలను సవరించాలని డిమాండ్ చేస్తున్నారు.

యాక్టింగ్‌లు చేసిన కూడా ప్రమోషన్లకు నో...

అండర్‌గ్రౌండ్‌లో పనిచేసే చాలా మంది జనరల్ మజ్దూర్‌లుగా ఉండడానికి ఇష్టపడి మిగితా డిజిగ్నేషన్లకు వెళ్లడం లేదు. అవన్నీ నేడు ఖాళీలుగా మిగులుతున్నాయి. కంపెనీలో కొత్తగా చేరిన వారికి బదిలీ వర్కర్‌గా డిజిగ్నేషన్ ఇస్తారు. వీరు ఏడాదిలో అండర్‌గ్రౌండ్‌లో అయితే 190 మస్టర్లు, సర్ఫేస్‌లో అయితే 240 మస్టర్లు పూర్తి చేస్తే వారికి అండర్‌గ్రౌండ్ జనరల్ మజ్దూర్‌గా ప్రమోషన్ కల్పిస్తారు. ఇలా అండర్‌గ్రౌండ్‌లో జనరల్ మజ్దూర్‌లుగా చేరిన వారిని కంపెనీ ఎక్కడ ఖాళీ ఉంటే అక్కడ పనులకు పురమాయిస్తోంది. ఇలా సపోర్టుమెన్, లైన్‌మెన్, కోల్‌కట్టర్, ఎస్‌డీఎల్ ఆపరేటర్‌తో పాటు ఇంజనీరింగ్ డిపార్టుమెంట్‌లో హెల్పర్లుగా పంపిస్తారు. వీటిని యాక్టింగ్‌లు అంటారు. కనీసం మూడేళ్ల పాటు ఏడాదికి 150 రోజులు ఆ కేటగిరీలో యాక్టింగ్‌లకు వెళ్లితే వారికి ఆ డిజిగ్నేషన్‌లో ప్రమోషన్ కల్పిస్తారు.

నిబంధనల సవరణకు చర్యలు..

అండర్ గ్రౌండ్ జనరల్ మజ్దూర్లకే సర్ఫేస్ జనరల్ మజ్దూర్లుగా తీసుకోవడమనే నిబంధనలు సవరించాలని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులు ఇటీవల కంపెనీకి లేఖ రాశారు. యాజమాన్యం సానుకూలంగా ఉండడంతో నిబంధనల సవరణకు చర్యలు చేపట్టిందని తెలిసింది. దీనిపై నోట్ తయారు చేసి ఉత్తర్వులు సిద్ధం చేశారు. కానీ విడుదలకు ఎన్నికల కోడ్ ఆటంకంగా మారింది. దీంతో ఎన్నికల తరువాతే తెరపైకి తేవాలని కంపెనీ అధికారులు భావిస్తున్నారని తెలిసింది.



భూగర్భంలో పని చేస్తున్న సపోర్టుమెన్ కార్మికులు

అమలుకు త్వరలో ఉత్తర్వులు

సర్ఫేస్ జనరల్ మజ్దూర్ ప్రమోషన్లకు అండర్ గ్రౌండ్‌లోని అన్ని డిజిగ్నేషన్ల వారికి అవకాశం కల్పించబోతున్నాం. దీనిపై కంపెనీకి తాము లేఖ రాయగా కంపెనీ సానుకూలంగా స్పందించింది. దీనికి సంబంధించిన ఉత్తర్వులు సిద్ధమయ్యాయి. వీటి విడుదలకు ఎన్నికల కోడ్‌తో జాప్యం అవుతున్నట్లు తెలిసింది.

– వీ సీతారామయ్య, ఏఐటీయూసీ అధ్యక్షుడు

లారీ, బైక్ ఢీ.. యువకుడికి గాయాలు

భీమిని: కన్నెపల్లి మండలంలోని జన్కాపూర్ గ్రామ శివారులోని కల్వర్టు వద్ద గురువారం లారీ -బైక్ ఢీకొన్న ఘటనలో యువకుడికి గాయాలయ్యాయి. దహెగాం మండలంలో కంకర అన్‌లోడ్ చేసి వస్తున్న లారీ జన్కాపూర్ నుంచి కన్నెపల్లి వైపునకు వెళ్తున్న బైక్ ఎదురుఎదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో యువకుడికి గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రుడిని 108 అంబులెన్స్‌లో బెల్లంపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం కరీంనగర్‌కు తరలించారు. ఈ విషయమై కన్నెపల్లి ఎస్సై గంగారాంను కోరగా తమకు ఫిర్యాదు అందలేదని పేర్కొన్నారు.



ప్రమాదానికి గురైన బైక్

మల్లన్న ఆలయంలో చోరీ

- హుండీ డబ్బులతో పాటు వెండి ప్రతిమలు అపహరణ..
- ఓ ఇంటి ఎదుట నిలిపి ఉంచిన ట్రాలీ ఆటో సైతం

దండేపల్లి: మండల కేంద్రంలో బుధవారం రాత్రి వేర్వేరుగా జరిగిన రెండు దొంగతనాలు కలకలం రేపాయి. గ్రామంలోని శ్రీమాల్గాం మల్లన్న ఆలయంలో రెండు రోజుల క్రితం వరకు మల్లన్న పట్నాలు, భోనాల వేడుకలు ఘనంగా జరిగాయి. అక్కడ ఉన్న టెంట్ సామాన్లు తీసుకెళ్లడం కోసం టెంట్‌హౌజ్ సిబ్బంది గురువారం ఆలయం వద్దకు వచ్చే సరికి గుడి తలుపులు తీడదీసి ఉన్నాయి. దీంతో వారు యాదవ సంఘం నాయకులకు సమాచారం ఇచ్చారు. దీంతో వారు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్సై స్వరూప్‌రాజ్ ఆలయం వద్దకు చేరుకుని పరిశీలించారు. క్లూస్‌టీంను రప్పించి వివరాలు సేకరించారు. దొంగలు గుడిలోకి చొరబడినా ఆలయంలోని రూ.18వేల విలువ చేసే 30 తులాల వెండి ప్రతిమలు, హుండీని ఎత్తుకెళ్లారు. ఖాళీ హుండీని ఆలయ సమీపంలో పొలంలో పడేశారు. ఇటీవల ఆలయం వద్ద పట్నాలు వేడుకలు నిర్వహించడంతో, భక్తులు హుండీ ద్వారా కానుకలు సమర్పించారు. అందులో సుమారుగా రూ.50వేల వరకు ఉంటాయని యాదవ సంఘం పెద్దలు భావిస్తున్నారు. సంఘ నాయకుడు గొట్ల భూమన్న ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.



పగలగొట్టిన హుండీని పరిశీలిస్తున్న ఎస్సై

ఇంటి ఎదుట నిలిపిన ఆటోట్రాలీ..

దండేపల్లికి చెందిన షేక్ హాజీ తన ఆటో ట్రాలీని బుధవారం రాత్రి ఇంటి ఎదుట నిలిపి ఉంచాడు. గురువారం ఉదయం లేచి చూసే సరికి ఆటో ట్రాలీ కనిపించలేదు. దీంతో అతను వెంటనే దండేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై స్వరూప్‌రాజ్ తెలిపారు. దొంగల కోసం గాలిస్తున్నామని ఎస్సై పేర్కొన్నారు.

'కాంట్రాక్ట్ కార్మికుల పనివేళలు మార్చాలి'

రామకృష్ణాపూర్: ఎండల తీవ్రత దృష్ట్యా సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల పనివేళలు మార్చాలని కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు బ్రహ్మానందం డిమాండ్ చేశారు. గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ తీవ్రతరమవుతున్న ఎండల నేపథ్యంలో పనివేళలు మార్చాలని ఇప్పటికే పలు వినతిపత్రాలు సమర్పించినా అధికారులు చర్యలు తీసుకోవటం లేదన్నారు. సూపర్‌వైజర్లు కాంట్రాక్ట్ కార్మికులపై పని ఒత్తిడి తెస్తున్నారని, కార్మికులు అనారోగ్యానికి గురైతే యాజమాన్యమే బాధ్యత వహించాలన్నారు. నాయకులు గజ్జి మల్లేష్, వెంకటేష్, రంజిత్ పాల్గొన్నారు.

అడవిలో మెరిసిన వన్యప్రాణులు



నీలుగాయి



అడవి దున్న

వేసవిలో చెట్ల ఆకులు రాలి అడవి పచ్చిక బయళ్లుగా మారాయి. దీంతో అడవిలో ఉండే జంతువులు పరుగులు కళ్లకు స్పష్టంగా కనిపిస్తాయి. జన్నారం అటవి డివిజన్‌లోని జన్నారం రేంజ్‌లోని బైసన్‌కుంట ప్రాంతంలో అడవి దున్న, నీలుగాయిలతో పాటుగా పలు చుక్కల దుప్పులను అటవి అధికారులు కెమెరాలో బంధించారు.

– జన్నారం

ఉద్యోగుల పోస్టల్ బ్యాలెట్ ఇలా..

- ఉమ్మడి జిల్లాలో 10,489 మందికి ఎన్నికల విధులు
- పూర్తయిన తొలివిడత శిక్షణ
- వీరికి పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునే అవకాశం

నియోజకవర్గాల్లో సిబ్బంది వివరాలు..

నియోజక వర్గం	పోలింగ్ కేంద్రాలు	సిబ్బంది
నిర్మల్	306	1,554
ఖానాపూర్	305	1,555
ముధోల్	311	1,584
బోథ్	302	1,472
ఆదిలాబాద్	290	1,412
ఆసిఫాబాద్	304	1,480
సిర్పూర్	293	1,432
మొత్తం	2,111	10,489



శిక్షణ పొందుతున్న ఉద్యోగ ఉపాధ్యాయులు (ఫైల్)

నిర్మల్‌ఖిల్లా: జిల్లాలో లోక్‌సభ ఎన్నికల ప్రక్రియ కసరత్తు శరవేగంగా కొనసాగుతోంది. అధికార యంత్రాంగం పోలింగ్ కోసం అన్నిరకాల ముందస్తు ఏర్పాట్లు చేస్తోంది. ఉమ్మడి జిల్లాలో ఎన్నికల నిర్వహణలో ప్రధాన భూమిక పోషించే ఉద్యోగ, ఉపాధ్యాయులకు తొలివిడత శిక్షణ కూడా గురువారం నాటికి పూర్తయింది. ఎన్నికల విధులకు హాజరు కానున్న ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోనున్నారు. ఇందుకు కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలు విడుదల చేసింది. పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకున్న వారు ఎంపిక చేసిన ఫెసిలిటేషన్ కేంద్రాల్లో ఓటు వేయాల్సి ఉంటుంది.

పోస్టల్ బ్యాలెట్ వినియోగం ఇలా....

పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు ఫారం నంబర్ -12 ఇప్పటికే శిక్షణ కొనసాగుతున్న కేంద్రాల్లో అందజేశారు. అందులో వారు ఎక్కడ ఓటు వేయాలో ఎంచుకోవాలని సూచించింది. తాము ఓటరుగా నమోదై ఉన్న నియోజకవర్గం లేదా విధులు నిర్వర్తించే నియోజకవర్గం ఎంపిక చేసుకోవచ్చని పేర్కొంది. ఉద్యోగి పేరు, గుర్తింపు సంఖ్య, హోదా, శాఖ, మొబైల్ నెంబరు, పనిచేస్తున్న నియోజకవర్గం, సొంత నియోజకవర్గం, ఓటరు జాబితాలో సంఖ్య, గుర్తింపు కార్డు సంఖ్య వివరాలను ఫారం నెంబర్ -12 లో పొందుపరచాలని పేర్కొంది. పోస్టల్ ఓటు వేసే ఉద్యోగ ఉపాధ్యాయుల కోసం ఫెసిలిటేషన్ కేంద్రాలను కార్యాలయాల్లో ఏర్పాటు చేసింది. పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకునే వారికి రాష్ట్ర ప్రభుత్వం ఒకరోజు ప్రత్యేక సాధారణ సెలవు దినాన్ని కూడా మంజూరు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది.

ఆదిలాబాద్ పార్లమెంటు పరిధిలో..

ఆదిలాబాద్ పార్లమెంటు పరిధిలో విధులు నిర్వహించాల్సిన ఎన్నికల ఉద్యోగులకు ఇప్పటికే తొలివిడత శిక్షణ పూర్తి కాగా వారంతా పోస్టర్ బ్యాలెట్ వినియోగించుకోవాల్సి ఉంటుంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పార్లమెంటు పరిధిలోకి వచ్చే నిర్మల్, ముధోల్, బోథ్, ఆదిలాబాద్, ఖానాపూర్, ఆసిఫాబాద్, సిర్పూర్ నియోజకవర్గాల పరిధిలో విధులు నిర్వహించాల్సి ఉంటుంది. ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లోని 2,111 పోలింగ్ కేంద్రాలకు మొత్తం 10,489 మంది ఉద్యోగులు ఎన్నికల విధులు నిర్వహించనున్నారు. ఇందులో 55 ప్రభుత్వ శాఖల ఉద్యోగులను ఎంపిక చేశారు. ఎన్నికల నిర్వహణలో వీరంతా భాగస్వాములు కానున్నారు. పీవో, ఏపీఓ, ఓపీఓల కోసం ఆయాశాఖల్లో పని చేస్తున్న వారిని సీనియారిటీని బట్టి నియమించారు.

ఒక్కో పోలింగ్ కేంద్రానికి నలుగురు...

ఒక్కొక్క పోలింగ్ కేంద్రానికి నలుగురు చొప్పున సిబ్బందిని నియమించనున్నారు. మరో 20 శాతం మంది ఉద్యోగులు రిజర్వులో ఉంచేలా అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

పాతమంచిర్యాల: తెలంగాణ రిటైర్డ్ ఎంప్లాయిస్ అండ్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గం ఎన్నికలు 2024-26 సంవత్సరానికి నూతన కార్యవర్గ సభ్యులను ఎకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పి.రవికుమార్, ఉపాధ్యక్షుడిగా జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శిగా గంట్ల మాధవరెడ్డి, సంయుక్త కార్యదర్శిగా విజయ్‌సింగ్, కోశాధికారిగా సత్యనారాయణ, ముఖ్య సలహాదారులుగా ఆడిచెర్ల రాములు, కార్యవర్గ సభ్యులుగా బూర్ల భాస్కర్, ఆనందాచారీ, చంద్రశేఖర్, శంకర్‌లింగంలను ఎన్నుకున్నారు.

దొంగతనం కేసులో నలుగురికి రిమాండ్

నెన్నెల: కోనంపేటలో దొంగతనానికి పాల్పడిన నలుగురిని గురువారం పోలీసులు అరెస్ట్ చేశారు. బెల్లంపల్లి రూరల్ సీఐ అఫ్జలుద్దీన్, ఎస్సై ప్రసాద్ పోలీస్‌స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. వేమనపల్లి మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన మాడె సుగుణాకర్ అలియాస్ రాము, దుర్గం రాజబాబులు కోనంపేటకు చెందిన గొల్లపల్లి మహేష్, రాంటెంకి బన్ని జల్సాలకు అలవాటుపడ్డారు. మార్చి 24న రాత్రి కోణంపేటలో దుర్గం రాజారాం కిరాణషాపులోకి దూరి పది గ్రాముల రెండు బంగారు ఉంగరాలు, రూ.30వేల నగదు, మొబైల్ ఫోన్ దొంగలించారు. దొంగలించిన ఫోన్‌లో సుగుణాకర్ తన సిమ్ వేసి దానికి లాక్ ఉండటంతో మళ్లీ స్విచ్ఛాప్ చేయగా, సాంకేతిక పరిజ్ఞానంతో వారిని పట్టుకొని విచారించగా నేరాన్ని ఒప్పుకున్నారు. నలుగురిని అరెస్ట్ చేసి బెల్లంపల్లి కోర్టులో హాజరుపర్చినట్లు వివరించారు.



వివరాలు వెల్లడిస్తున్న సీఐ, ఎస్సైలు